12

# ఏజెంటు సుబ్రావు

సుబ్బారావుకు కోపంగా - విసుగ్గా ఉంది. కడుపులో ఆత్మారాముడు గోల చేస్తున్నాడు. ప్రొద్దునే లేచి ఓ గ్లాసు నీళ్ళ కాఫీ తాగి వచ్చాడు. అప్పటి నుండి వేటలో పడ్డాడు. మధ్యలో ఇతగాడు గుర్తుకొచ్చి అతని కోసం ఉదయం ఎనిమిది నుండి పడిగాపులు కాస్తున్నాడు.

శశిధర రెడ్డి ఉదయం తొమ్మిదికి ఫ్యాక్టరీకి వచ్చాడు. ఆనందంగా అతన్ని పలకరించాడు. విష్ చేశాడు.

" ఏం సుబ్రావు ఇలా వచ్చావు - నాతో ఏమైనా పని ఉందా?" మిగతావారికి కరచాలనం చేస్తూ అడిగాడు శశిధర్.

'వీడి మొహం మండ, ఈ రోజు ఉదయం ఎనిమిదికి రమ్మని చెప్పి - మళ్ళీ ఏం పని అని అడుగుతున్నాడేంటి!' అని మనసులో తిట్టుకుని 'రెడ్డొచ్చె మొదలాడులా' మళ్ళీ చెప్పాడు.

" తమరు నాకు ఓ పది నిమిషాలు టైమిస్తే - మీతో పర్సనల్‌గా మాట్లాడాలి!" అతి వినయంగా చెప్పాడు.

" నీకూ నాకూ పర్సనల్ ఏంటి - నీకులం వేరు నాకులం వేరు కనీసం నువ్వు రాజకీయ నాయకుడివి కాదు - అరాచకీయ నాయకుడివి కాదు - " అని నవ్వాడు పాచి పళ్ళు బయట పెడ్తూ.

చుట్టు పక్కల వున్న పెద్ద మనుషులు పగలబడి నవ్వారు.

పెద్దగా, తను కూడ, నవ్వక తప్పింది కాదు సుబ్బారావుకు.

" తమరితో భీమా గురించి కాస్త మాట్లాడదామని - అంతకు ముందు తమర్ని ఓ పది సార్లు కలిశాను, ఇదే విషయంలో. గుర్తు వుండి ఉంటుంది - " అంటూ బ్యాగు ఓపెన్ చేసి కాగితాలు - పుస్తకాలు బయటకు తియ్యబోయాడు.

" ఊ ! ఆగు ! ఆగు ! నాకు కొంచెం పనుంది లోపల - ఓ పది నిమిషాల తరువాత పిలుస్తాను - కాస్త కూర్చో !" అని చెప్పి ఆ మానవుడు లోపలికి పోయి

నాలుగు గంటలైంది.

ఎవరెవరో వస్తున్నారు - కలుస్తున్నారు - పోతున్నారు - కాని సుబ్రావుకు మటుకు ఇంటర్వ్యూ రాలేదు.

అయినా ఒకటి రెండు సార్లు తన కార్డు లోపలికి పంపించాడు - పియ్యే బయటకు వస్తే నస పెట్టాడు. అన్నిటికీ కూర్చోమన్నారనే సమాధానం!

ఇక తప్పలేదు శవజాగరణ చేయక !

ఇంతకీ సుబ్బారావు - ఎవరు - ఏమిటి - అతగాడేం చేస్తున్నాడు అన్న అనుమానాలుంటే ఫ్లాష్ బ్యాక్ చూద్దాం -

అతను ఓ ప్రముఖ బీమా కంపెనీలో ఓ ఏజెంటు, బీమా సలహాదారుడు - ఆర్థిక సలహాదారుడు - కుటుంబ సంరక్షకుడు, వగైరా పేర్లు తగిలించుకున్న వాడు. అతనికి చదువు అబ్బ లేదు - కాని లోకజ్ఞానం చాలా ఎక్కువగా ఉండటంతో అనాయసంగా కాపీలు కొట్టి టెన్తు క్లాసు పాసయ్యాననిపించుకున్నాడు.

అతని తెలివి తేటలకు - అతని బద్ధకానికి ఎవరూ పిల్చి ఉద్యోగం యివ్వలేదు. సాధారణంగా అతని మొహం కొత్త వ్యక్తి చూస్తే మళ్ళీ చూద్దామనుకోడు. అతను ఎంత జిడ్డో - అతని మొహం కూడ అంత జిడ్డు కారుతూ ఉంటుంది. మాట్లాడే తెలివి తేటలు కూడ లేవు.

అలా పనీ పాట లేకుండా - తల్లి దండ్రులకు గుండెలమీద కుంపటిలా తయారై పోయాడు. తండ్రి ఎన్నో వ్యాపారాలు పెట్టించాడు - కాని అన్నింటిని దివాళా తీయించాడు. ఎన్నో ప్రైవేటు షాపుల్లో పని కుదిర్చాడు కూసింత జీతం రాళ్ళకు. అక్కడ నుండి ఓ నెల రోజుల్లో పారి పోయి వచ్చేవాడు - లేదా వాళ్ళన్నా తరిమేసే వారు ఇతని ప్రవర్తనకు.

గంతకు తగ్గ బొంతలా ఏదో దూరపు చుట్టరికపు సంబంధాన్ని చేసుకున్నాడు. వాళ్ళు కూడ వాళ్ళమ్మాయి తెలివి తేటల మీద - జాతకం మీద నమ్మకం పెట్టుకుని ఇతగాడికిచ్చి పెళ్ళి చేశారు. లక్ష్మి సహనం, ఓర్పు గల ఇల్లాలు, అంతే గాక కాస్త

చదువు ఒంట బట్టించుకుంది కాబట్టి యిస్కూల్లో టీచరుగా పని చేస్తూ నాలుగు రాళ్ళు మోసుకొస్తూ ఉంటుంది.

పెళ్ళయితే పిల్లలు పుట్టాలి కాబట్టి ఇద్దరు - బాబు - పాప పుట్టేశారు - పుట్టింతర్వాత పెరగాలి కాబట్టి పెరుగుతున్నారు - మనవడు - మనవరాలిని చూసి మురిసి పోతూ సుబ్రావు తండ్రి వారి అవసరాలు తీరుస్తూ ఉండేవాడు. పిల్లలు పెరుగుతూంటే బడి దడి తప్పదు కాబట్టి తను పని చేస్తున్న బడిలోనే పడేసింది లక్ష్మి.

ఇలా కాలక్షేపం జరుగుతూండగా ఓ రోజు ఓ బీమా విస్తరణాధికారి వాళ్ళింటికి వచ్చాడు, ఓ పట్టాన తగిలిద్దామని. సుబ్బారావు తండ్రి మాధవరావు శ్రద్ధగా వింటుండగా మన ప్రబుద్ధుడు అడ్డుతగులుకుంటూ వచ్చాడు. తన లోకజ్ఞానాన్ని చాటుతూ.

"బీమా కంపెనీ దంతా దగా, మోసం ! మీ దాంట్లో డబ్బులు రావాలంటే చచ్చి పోవాలి. చచ్చిన వాడికే లాభం కాని - బ్రతికిన వాడికి లేదు! మా డబ్బులకు వడ్డీ గిట్టు బాటు కాదు."

విస్తరణాధికారి వీరప్పకు నవ్వొచ్చింది. అతనితో పాటు వచ్చిన ఏజెంటు రత్నంకు వణకు వచ్చింది ఇతగాడి అడ్డుగోలు ప్రశ్నలకు.

" నువ్వు చాలా తెలివి గల వాడివి ! చాలా బాగా ఆలోచిస్తావు !" మెచ్చుకున్నాడు వీరప్ప.

మాధవరావుకు మతి పోయింది. తన పుత్ర రత్నంను, వాడు పుట్టింతర్వాత మొదటి సారి మెచ్చుకున్న వెధవ వీరప్పే కనిపించాడు.

దాంతో సుబ్రావుకు గర్వం కలిగింది. తన తెలివి తేటల మీద నమ్మకం కలిగింది. ఆరోజు పాలసీ రాలేదు - ఏజెంటు రత్నం మటుకు మళ్ళీ జన్మలో ఆగుమ్మం ఎక్కకూడదనుకున్నాడు.

కాని వీరప్ప మటుకు వారితో పరిచయాన్ని వదులుకో లేదు - ఆ వీధిలో గాని - అటువైపు గాని పోతున్నప్పుడు వచ్చి ఓ అయిదు నిమిషాలు మట్లాడి

పోతూండేవాడు.

ఓ రోజు ప్రతి పాదించాడు.

"మీ వాడు చాకు లాగా ఉన్నాడు – అతను కనుక ఏజెన్సీ తీసుకుంటే దున్నేస్తాడు" అని చెప్పాడు వీరప్ప.

"మా వాడి సంగతి నీకేం తెల్సు ! వాడొట్టి వెధవ ! నోట్లో నాలుక లేదు – ఎవరితోనూ సరిగా మాట్లాడలేదు – పైగా వాడికి లెక్కలే రావు – ఇప్పుడు చెప్పింది కాసేపటికి గుర్తుండదు." మాధవరావు తేలిగ్గా తీసిపారేశాడు.

"మాకు అటువంటి వాళ్ళే కావాలి సార్ !" చెప్పాడు వీరప్ప.

"మా వాడు ఒట్టి తెలివి తక్కువ దద్దమ్మ ! చదువు రాదు –"

"ఫర్లేదు సార్ – మాకు అటువంటి వాళ్ళే కావాలి సార్!" మళ్ళీ చెప్పాడు.

"ఓ అంటే నా రాదు – ఏ పని చెయ్యలేడు – గాలికి బలాదూరుగా తిరగమంటే వాడే నంబరు వన్ను!"

"వెరీ నైస్ !"

"వాడికి సిగ్గు ఎగ్గూ లేదు"

"మరీ మంచిది!"

"ఒక బాధ్యత లేదు – సంసారం లేదు – వాడికి పెళ్ళి చేసి నేను చచ్చి పోతున్నాను – వాడ్ని వాడి కుటుంబాన్ని సాకలేక !" వా పోయాడు.

"వండర్ ఫుల్ ! అటువంటి వాడే కావాలి నాకు –"

"ఏందయ్యా ! నువ్వు వాడ్ని తెగ మెచ్చుకుంటున్నావు – వాడికి తిండి దండగ అని అందరూ అనుకుంటూ ఉంటే! వాడొట్టి మూర్ఖుడు – వాడికి తెలీదు – ఇంకోడు చెబితే వినడు –" మాధవరావు కోపంగా చెప్పాడు.

తలూపాడు వీరప్ప

"వాడు ఒకదానికి బదులు యింకో పాలసీ యిస్తే తీసుకున్నవాడి గతి ఏంకాను.

"వాడెవడో ఏదో అవుతాడని మానుకుంటామా ? ? పేషెంటు చచ్చి పోతాడని భయపడి డాక్టరు ఆపరేషను చేయకుండా ఉంటాడా ! అలాంటి భయాలు పెట్టుకోవద్దు. మన దేశంలో తెలివి తక్కువవాళ్ళే ఎక్కువగా ఉన్నారు – కాబట్టి వాళ్ళదే రాజ్యం !" వీరప్ప చెప్పాడు నవ్వుతూ.

"నీకు పాలసీలు అమ్మించి పెడితే నాకేం లాభంట?" లా పాయింటు తీశాడు సుబ్బారావు."

ఇంక వీరప్ప అతని కొచ్చే ప్రయోజనాల గురించి క్లాసు తీసుకున్నాడు – ఆ రకంగా సుబ్రావు ఏజెంటుగా అవతారం ఎత్తాడు.

అజ్ఞానమే ఆయుధంగా – మూర్ఖత్వమే ముచ్చటగా – జిడ్డు తనమే దొడ్డతనంగా – నిరుద్యోగమే వరంగా – అబద్దాలే ఆలంబనగా రంగంలోకి చొచ్చుకు పోయాడు. – సుబ్బారావు.

వామనుడిలాగా బీమారంగంలో తన విశ్వరూపం చూపాడు.

కొత్త బిచ్చగాడు పొద్దెరగడు లాగా అతను ఉదయం నుండి రాత్రి దాకా ఒకటే తిరుగుడు ! ఒకటే పరుగు ! ఎక్కని గుమ్మం లేదు – దిగని గుమ్మం లేదు – ఇన్సూరెన్సు ఏజెంటు పదవిని ప్రసిడెంటు ఆఫ్ ఇండియా పదవిగా భావించి అతను కలవని మానవుడు లేడు – ఆ చుట్టుప్రక్కల గ్రామాల్లో – ఆ ఊళ్ళో !

'నందో రాజభవిష్యతి' చందాన పాలసీ మీద లాభాలు – ప్రయోజనాలు నోటికొచ్చినట్లు చెప్పేసేవాడు.

ఇతని దెబ్బకు ఎప్పటినుండో ఆ రంగంలో ప్రసిద్ధులు అయిన వాళ్ళు కూడ షేక్ మస్తాన్ లాగా షేక్ అయి పోయి – షేపులు లేకుండా పారిపోయారు.

మొదటి సంవత్సరంలోనే దాదాపు మూడొందల పాలసీలు చేసి మూడు లక్షల పైన డబ్బు సంపాదించాడు – కమీషన్ల రూపంలో.

మొదటి పాలసీ మీద కమీషన్ చేతులు పడే సరికి నెత్తురు రుచి మరిగిన పులిలాగా విజృంభించాడు.

త్వరలోనే మోటరు సైకిలు కొన్నాడు – తన వేషభాషలు మార్చి వేశాడు. గ్రామాలకు పోతే వారి భాషలో మాట్లాడ్డమే కాకుండా వారిలా వేషాలు వేసేవాడు. చిన్న పెద్ద ముసలి ముతక – బీద బిక్కి అన్న భేదం లేకుండా అందర్ని పలకరించే వాడు. అందర్లో కలిసిపోయేవాడు.

ఏదో ఒక చిన్న పాలసీ యివ్వంది వదిలి పెట్టేవాడు కాదు. దీనంగా మొహం పెట్టి – రేపే లోకం అంత మయి పోతుందన్నంత హంగామా సృష్టించే వాడు పోయిన చోట!

" రేపు నువ్వు చచ్చావే అనుకో – నీ పెళ్ళాం ముండ మోస్తుంది – ఆపైన ఏం చేస్తుంది బ్రతకాలంటే !" అని మొరటోళ్ళ దగ్గర –

" మీకేమన్నా అయితే మీ ఫ్యామిలీ రోడ్డు మీద పడాల్సి వస్తుంది కదు సార్!" అని కొంచెం సెన్సిటివ్ పీపుల్సు దగ్గర –

" ఉన్నట్లుండి మీ ఆదాయం మీ కుటుంబానికి ఆగిపోయిందనుకోండి... అదే ఆదాయం ఆ కుటుంబానికి మీరు లేకపోయినా అందాలంటే ఏం చేయాలని" కొంచెం లెక్కలు వేసుకునే వాళ్ళ దగ్గర –

" మీకేమన్నా అయితే మీ వాడి చదువు ఆగిపోతుంది కదు సారూ – మీ అమ్మాయి పెళ్ళి ఆగి పోదా సారూ !" అంటూ మధ్య తరగతి మానవుల దగ్గర –

"జరగరానిది మీ ఆయనకు జరిగితే నీ బ్రతుకు ఏమవుతుందమ్మా చెల్లమ్మా!" అంటూ ఆడవాళ్ళ దగ్గర .

భయపెట్టి పాలసీలు చేసేవాడు. ఇలా భయపెట్టడం అతగాడు డాక్టర్ల దగ్గర నేర్చుకున్నాడు – " కాన్పు కష్టమవుతుంది – పెద్ద ప్రాణానికే ముప్పు" అని "అర్జెంటుగా ఆపరేషన్ చెయ్యక పోతే మాది పూచి కాదు – ప్రాణానికి గ్యారెంటీ యివ్వలేమని" చెప్పే పెద్ద డాక్టర్ల దగ్గర చూసి – భయపెట్టి బ్రతకడం నేర్చుకున్నాడు సుబ్రావు.

లైసెన్సు తీసుకున్న మూడు సంవత్సరాల్లోనే ఓ వెలుగు వెలిగి పోయాడు. అతని ఆఫీసు టార్గెట్లు రెట్టింపు అందుకున్నాయి. అతను వీరప్ప అదిరిపోయే

నూతన వ్యాపారం అందించాడు. సుబ్రావు ఎన్నో సన్మానాలు ప్రశంసా పత్రాలు అందుకున్నాడు – వీరప్పకూ అందించాడు.

అంతటి ఘన చరిత్ర కలిగిన సుబ్బారావుకు ఓ పెద్ద పాలసీ చేయించాలని మనసులో పడింది. కనీసం కోటి రూపాయల పాలసీ చేయించాలని నిర్ణయించుకున్నాడు. దానికి గొర్రె ఎవడు దొరుకుతాడా అని ఆలోచించి శశిధర రెడ్డిని ఎంచుకున్నాడు.

శశిధర రెడ్డి వ్యాపారవేత్త! పారిశ్రామిక వేత్త! పెద్ద బుర్ర లేక పోయినా అర చేతిలో అదృష్టరేఖ జెర్రి పోతులా ఉండటంతో, పట్టిందల్లా బంగారమై అతను వెలిగి పోతున్నాడు. అతనికి అంత డబ్బు కట్టే స్తోమత ఉందని గ్రహించి అతని కోసం వల పన్ని చాలా సార్లు అతన్ని ఎటాక్ చేశాడు. చిత్రంగా అతను వలలో పడ్డట్టు పడి ... లేచి పరుగెత్తుకు పారి పోతున్నాడు.

ఆ క్రమంలో ఇతగాడు అతగాడ్ని ఎన్నో సార్లు కలవడం – మాట్లాడ్డం – అతగాడు ఎన్నో సార్లు తప్పించుకోవడం జరుగుతున్నది – ఇప్పటికి ఓ పాతిక సార్లు ఇది జరిగి ఉంటుంది మరి.

మనసులో తిట్టుకుంటూ ఉండగా సదరు శశిధర రెడ్డి బయటకొచ్చాడు – అందరూ నిల్చున్నారు –

“ మీ అందరి భోజనాలు అయ్యాయా – లేక పోతే క్యాంటినుకు రండి మీకు ఫ్రీగా భోజనాలు పెడతారు!” చెప్పాడు అక్కడున్నవారిని ఉద్దేశించి – అడుక్కునే వారికి ముష్టి పెట్టినట్లు.

సుబ్బారావు అందరిని చూశాడు – వాళ్ళల్లో చాలామంది డొనేషన్ల కోసం – రికమెండేషన్ల కోసం వచ్చారు. ధైర్యం చేసి అడిగాడు.

“ సార్ ! నాకు ఓ పది నిమిషాలు టైమిస్తే – ”

“ అరె ! నువ్వింకా యిక్కడే ఉన్నావా – ఎప్పుడొచ్చావు ?” శశిధర రెడ్డి

“ ఎప్పుడు రావడమేంటి – అసలు పోతేగా !” ఏడ్పు మొహంతో అన్నాడు.

"పొద్దున ఎనిమిది నుండి ఇక్కడే పడున్నాను. ఆఖరికి టిఫెను కూడ చెయ్యలేదు."

" అయ్యో ! నీ పన్లు చూసుకు రావల్సింది – నాకు ఒక్క క్షణం తీరడం లేదు – ఇప్పుడు మీటింగు కు వెళుతున్నాను – రేపు చూద్దాం – " చెప్పాడు శశిధర రెడ్డి

"రేపు నాకు కొంచెం పనుంది ... ఎల్లుండి రమ్మంటారా ?"

" ఎల్లుండి నే ఊళ్ళో ఉండను – తర్వాత ఫోన్ చేసిరా !" చెప్పాడు శశిధర రెడ్డి – మొహం చాలాచీదరగా పెట్టి అడుక్కునే వాడ్ని చూసినట్లు.

ఓ రెండు రోజుల తర్వాత ఫోన్ చేసి వెళ్ళాడు.

" అర్జెంటు పనిలో వున్నా ! మళ్ళీ కలు " అని చెప్పాడు ఓ మూడు గంటలు కూర్చో బెట్టి –

ఓ వారం తర్వాత కలిస్తే " నీతో తీరికగా మాట్లాడలయ్యా ఇప్పుడు నాకు కుదరదు – మళ్ళీ కలు " అన్నాడు శశిధర రెడ్డి ఓ రోజల్లా కూర్చో బెట్టి – తాపీగా.

ఇంకో రోజు కలిస్తే " అస్సలు – ఎందుకు నాచుట్టూ తిరుగుతున్నావు నీకు డొనేషన్ కావాలా ?" అని అడిగాడు –

దాంతో చిర్రెత్తు కొచ్చింది సుబ్బారావుకు.

మళ్ళీ ప్రవర చెప్పుకొచ్చాడు!" సుబ్బారావు ఓపిగ్గా – తనకోపము తనకు శత్రువు అని గుర్తు చేసుకుంటూ, అర్థం చేసుకున్నట్లు తలాడించాడు శశిధరరెడ్డి

" ఓహో!" అడుక్కోవడానికి వచ్చావా?"

"అయ్యా ! అడుక్కోవడానిక్కాదండి – పాలసీ అడగడానికి వచ్చాను –" సరి చేశాడు సుబ్బారావు.

" అదే లేవయ్యా ! ఏదైతేనేం లే !" చికాకు పడ్డాడు.

" పాలసీ ప్రయోజనాల గురించి నన్ను నాలుగు ముక్కలు చెప్పనిస్తే " – నీళ్ళు నమిలాడు సుబ్బారావు అతను కూర్చోమనకుండా కుర్చీలో కూర్చుంటూ.

" అరె ! నాకు అప్పాయింట్ మెంటుంది కాని – ఈ సారి వచ్చేప్పుడు మీ ఆఫీసర్ని పట్టుకురా !" ఇంకో మాటకు అవకాశం లేకుండా వెళ్ళి పోయాడు శశిధరరెడ్డి.

సుబ్బారావు పళ్ళు పటపట కొరికాడు.

ఓ వారం తరువాత వీరప్పను పట్టుకుని ఫ్యాక్టరీకి వచ్చాడు షరా మాములే! బయట కూర్చోవలసి వచ్చింది గంటలు గంటలు.

" వాట్ నాన్సెన్స్! నా అంతటి ఆఫీసరుకు ఇంత టైము వేస్టు చేయిస్తావా ? ముందుగా అప్పాయింట్ మెంటు తీసుకోవద్దు – ?" అంటూ వీరప్ప ధాం ధూం అని ఎగిరాడు సుబ్బారావు మీద.

సుబ్బారావు శశిధర రెడ్డి ఛాంబర్ లోకి దూసుకు పోయాడు తనకు ఇంటర్వ్యూ ఇమ్మని ఆడగడానికి. లోపల అతను కొందరు ఆడవాళ్ళతో పిచ్చాపాటి మాట్లాడుతూ కనిపించాడు. వాళ్ళు కిలకిలా నవ్వుతున్నారు. సీను మంచి రసకందాయంలో ఉంది.

"గెటవుట్ ఫూల్! నేను పిల్చినప్పుడు రా !" అని కసురుకున్నాడు "సారీ!" చెప్పి బయట కొచ్చాడు – సుబ్బారావు తన బ్రతుకును – తన వృత్తిని తిట్టుకుంటూ. ఛీ ఛీ ! బీమా వృత్తి అంటే ఊంఛ వృత్తి అయిపోయింది వీళ్ళ దృష్టిలో – వీళ్ళంతా ఏజెంటులను ఉద్దరించడం కోసం పాలసీలు చేస్తున్నట్లు ఫోజులు పెడతారు. ఏదన్నా జరిగినప్పుడు తెలుస్తుంది ఏజెంటు విలువ – వాళ్ళ సేవ విలువ!

"గురుగారూ ! మీరింటికి వెళ్ళండి – వీడి సంగతి నేను చూసుకుంటా ! అంటూ సుబ్బారావు తను కూడ ఇంటికి పోయాడు.

రెండు రోజుల తరువాత శశిధర రెడ్డి ఫ్యూనిషిని పంపించాడు అర్జెంటుగా సుబ్బారావును పట్టుకుని రమ్మని.

ముందు టైము లేదని బెట్టు చేసినా – మరీ బెట్టుకు పోతే మొదటికే మోసం వస్తుందని గ్రహించి రెక్కలు కట్టుకు వాలాడు.

"సుబ్రావు ! నాదోకోటి రూపాయల పాలసీ రాసుకో – ఏది రాస్తావు – నాకేం తెల్సుకాని – ఏది బెస్టు అయితే అది రాసుకో !" అని చెప్పాడు.

వందల పాలసీల్లో సుబ్బారావుకు వచ్చినవి తెలిసినవి రెండే రెండు పాలసీలే కాబట్టి గుడ్డిగా దాంలో ఒకటి రాసి ప్రీమియం డబ్బులు వసూలు చేసి జేబులో

వేసుకుని వీరప్ప దగ్గరకి వచ్చాడు.

వీరప్ప ఆశ్చర్యపోయి అడిగాడు " సుబ్బులూ ! వాడ్ని ఎలా బుట్టలో పెట్టావురా?"

" అది ట్రేడు సీక్రెట్టులే సారు - నీకు చెప్పకూడదు" అన్నాడు.

" బాబ్బాబు - నీకు పుణ్యం ఉంటుంది - ఇదొక్కటి చెప్పు లేకపోతే నాకు గుండె నొప్పి వస్తుంది" కాళ్ళు పట్టుకున్నంత పని చేశాడు.

బ్రతిమాలించుకుని బ్రతిమాలించుకుని అసలు విషయం చెప్పాడు.

" శశిధర రెడ్డికి ఈ మధ్య అపరిచిత వ్యక్తుల నుండి ఫోన్లు వచ్చాయిట ఇంత డబ్బు డొనేషను ఇవ్వు లేకపోతే లేపేస్తాం! అంటూ - అలా అతని ప్రాణానికి ముప్పు వాటిల్లింది ర్యాడికల్స్ నుండి అందుకని నేను గుర్తుకు వచ్చాను" చెప్పాడు సుబ్బారావు. ఆ ర్యాడికలు ఎవరో వీరప్పకు అర్థమైంది.

(నవ్య 1-11-2006)